## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

● మంత్రి వెంకట్‌రెడ్డి


జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 31: అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందకు చర్యలు తీసుకుంటామని రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు శుక్రవారం టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రీడల్లో విజేతలకు బహుమతులు, ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు అందించిన హెల్త్‌కార్డులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఏచూరి భాస్కర్, కొటగిరి దైవాదీనం, గుండగోని జయశంకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షకార్యదర్శులు పులిమామిడి మహేందర్‌రెడ్డి, గాదే రమేశ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సారాయి అమ్మితే కఠిన చర్యలు : ఎక్సైజ్ సీఐ కల్పన

గుడుంబా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కల్పన

త్రిపురారం, జనవరి 31: గ్రామాల్లో అక్రమంగా సారాయి తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటాదమని ఎక్సైజ్ సీఐ కల్పన హెచ్చరించారు. గుడుంబాను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ చేపట్టిన నెల రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం త్రిపురారం మండంలోని పలు గ్రామా ల్లో తనిఖీలు చేపట్టారు. లోక్యాతండా గ్రామానికి చెందిన మహిళ సారాయితో పట్టుబడగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. గ్రామాల్లో సారాయి తయారు చేసినా, నిల్వ చేసినా, అమ్మినా, నల్లబెల్లం రవాణా చేసినా తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్ఐలు జెక్కి రాంబాబు, ఆర్.సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## క్రీడలతో యువత మధ్య స్నేహభావం

● బీఆర్ఎస్ నాయకుడు నూక సైదులు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కట్టంగూర్, జనవరి 31 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీలు యువత మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు నూక సైదులు అన్నా రు. మండలంలోని పందనపల్లి గ్రామంలో ఫ్లయింగ్ ఈగల్ యూత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ సహకారంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ముప్పిడిముప్పిడి యాదయ్య, నాయకులు మేకల రమేశ్, గద్దపాటి నర్సింహ, నిమ్మనగోటి శివ, పరుశయ్య, గద్ద యాదగిరి, మహేశ్, సునీల్ పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

● డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ :స్థలం పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ/చండూరు/గట్టుప్పల, జనవరి 31 : విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి మండలంలోని మర్రిగూడ మండలంలోని ఖుదాభక్షపల్లి, శివన్నగూడెం, మర్రిగూడ, దామెరభీమనపల్లి గ్రామాల్లో, చండూరు, పుల్లెంల, కస్తాల, గట్టుప్పల్ మండలంలోని గ్రామాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఆయన వెంట సోలార్ ప్రాజెక్టు డీఎం పాండురంగారావు, డిప్యూటీ తాసీల్దార్ తారకరామన్, ఏపీఎం ప్రభాకర్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దిన్, సీసీలు నర్సింహ, శ్రీశైలం, భారతమ్మ, సర్వేయర్ రవి, మురళీకష్ణ, శేఖర్, ఏపీఓ పుల్లయ్య ఉన్నారు.

గట్టుప్పల్‌లో తాసీల్దార్ రాములు, ఎంపీడీఓ మాధవరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌రెడ్డి, సర్వేయర్ జైహింద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నదానం

అమ్మనాన్న అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న వెంకట్‌రామ్‌రెడ్డి

చండూరు, జనవరి 31: చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన టీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొబ్బల వెంకట్‌రామ్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చండూరు, నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఆల్పాహారం అందించారు. అనంతరం చౌటుప్పల్ పట్టణంలోని అమ్మనాన్న అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వరకాంతం రాజేశ్‌రెడ్డి, గోపిడి నర్సిరెడ్డి, బొడ్డు సతీశ్, నకిరేకంటి లింగస్వామి, పిన్సింటి వెంకట్‌రెడ్డి, భూతరాజు శ్రీహరి, నరేందర్‌రెడ్డి, ఇరిగి రామకృష్ణ, పెసర్ల హరీశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME**
I, Thatikonda Srinivas Reddy, S/o. Thatikonda Venkat Reddy, R/o. H.No.2.45, Ramapuram (Vill) Mellacheruvu (Mandal), Suryapet (Dist) have changed my name from Thatikonda Srinivasa Reddy to THATIKONDA SRINIVAS REDDY for all future purpose.

**NAME & SURNAME CHANGE AND POLICY BOND MISPLACED**
I, KANDIKATLA YASAIAH Als Katam Yasaiah Als. YESU, S/o. Mattaiah, Adavidevulapally, Nalgonda Dist. I submit that my policy No.603780325 in that policy my name recorded as KANDIKATLA YASIAH in my Bank A/c my name recorded as KATAM YESU, I am adapted my own Father KATAM SOMAIAH to KANDIKATLA MATTAIAH so both surname and names my only my policy bond also misplaced in my house.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
మరిన్ని వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులే: 9182777638

## అధికారులు బాధ్యతగా పని చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి, జనవరి 31 : ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. స్థానిక వైద్యాధికారి అర్చనతో మాట్లాడి ఆస్పత్రిలో సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ డెలివరీలు, మాతా, శిశు సంరక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రసవాలకు సంబంధించి ఈడీడీ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని, హైరిస్క్ కేసులు, కవలలు, ఇతర కేసులను మాత్రమే ఏరియా ఆస్పత్రులకు పంపాలని ఆదేశించారు. పీహెచ్‌సీకి అవసరమైన లేబర్‌రూమ్‌లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చే రహదారి వెంట లైట్లు ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేసారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. ఆమె వెంట తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, డాక్టర్ దివ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## గణితంపై విద్యార్థులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు నౌపాల్

రామగిరి, జనవరి 31: నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో శుక్రవారం గణితం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంపై అవగాహన సద స్సు నిర్వహించారు. కొచ్చిన్ యూనివర్సిటీ అధ్యాపకుడు నౌపాల్ పాల్గొని వృత్తి పరంగా, విద్యా పరంగా, ఇతర అంశాలల్లో గణితం అవశకతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, గణితం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

రామగిరి, జనవరి 31: నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎన్.వాణి, ఆర్‌టీఓ లావణ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల క్రికెట్ జట్టు క్రీడాకారుడికి సన్మానం

వస్రాంనాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురారం, జనవరి 31: బోర్డ్ ఆఫ్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఇండియా జట్టుకు ఎంపికైన మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన ధనావత్ వస్రాంనాయక్‌ను శుక్రవారం మాటూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వాసునాయక్ మాట్లాడుతూ మారుమూల గిరిజనతండాకు చెందిన వస్రాంనాయక్ దేశం తరుపున దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో ఆడడం గర్వకారణమన్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి అయిన వస్రాంనాయక్‌ను హెచ్ ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గట్టుప్పల్ మండల ఎంపీటీసీల స్థానాల విభజన పూర్తి

గట్టుప్పల్, జనవరి 31: కొత్తగా ఏర్పాటైన గట్టుప్పల్ మండలంలో ఎంపీటీసీ స్థానాల విభజనను మండల అధికారులు శుక్రవారం పూర్తి చేశారు. గట్టుప్పల్ మండలంలో మునుగోడు, చండూరు, మర్రిగూడెం మండలాల నుంచి కొన్ని గ్రామాలను కలుపడంతో మొత్తం 7 గ్రామ పంచాయతీలతో మండలం ఏర్పాటైంది. ఏడు గ్రామ పంచాయతీలను 5 ఎంపీటీసీ స్థానాలుగా విభజించారు. ఒక్కో ఎంపీటీసీ స్థానంలో 2 నుంచి 3 వేల ఓటర్లు ఉండేలా అధికారులు జాబితా రూపొందించారు. ఎంపీటీసీ విభజనపై అభ్యంతరాలను తెలుపాలంటూ నోటీస్‌బోర్డుపై ఉంచారు. అయితే అంతంపేట ఎంపీటీసీ స్థానంలో అంతంపేట, నామాపురం ఉండగా ఈ రెండు గ్రామాలను వేర్వేరు ఎంపీటీసీ స్థానాలుగా ఏర్పాటు చేయాలని నాలుగు వినతిపత్రాలు వచ్చాయని, వాటిని ఉన్నతాధికారులకు నివేదించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జూలకంటి మాధవ రెడ్డి తెలిపారు.

**ఎంపీటీసీ స్థానాలు ఇలా..**

అంతంపేట ఎంపీటీసీ పరిధిలో అంతంపేట, నామాపురం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గట్టుప్పల్ మండల కేంద్రాన్ని రెండు ఎంపీటీసీ స్థానాలుగా విభజించారు. తేరట్‌పల్లి ఎంపీటీసీ పరిధిలో తేరట్‌పల్లి, శేరుగూడెం, కమ్మగూడెం.. వెల్మకన్నె ఎంపీటీసీ పరిధిలో ఆ గ్రామపంచాయతీని చేర్చారు.

## అరకొర పథకాలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 31: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పథకాల తీరు ఊరికో కోడి.. ఇంటికో ఈక అనే విధంగా ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రెండు, మూడు పథకాలు మాత్రమే అది కూడా అరకొరగానే అమలు చేస్తున్నారని విమర్శించారు. సంక్రాంతి పండుగకు రైతు భరోసా అందిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ తర్వాత జనవరి 26 అన్నారని, అయినా నేటి వరకు రైతులకు రైతు భరోసా ఇవ్వలేకపోయారని విమర్శించారు. పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ రెండు కార్ల రైతు భరోసా అందించాలన్నారు. మహిళలకు రూ.2500 పథకం ఊసే ఎత్తడం లేదన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఏ మూలకూ సరిపోవని, రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, పరశురాములు, అంజద్ పాల్గొన్నారు.

## స్త్రీ నిధి రుణాలను వందశాతం రికవరీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్

మిర్యాలగూడటౌన్, జనవరి31: స్త్రీనిధి రుణాలను వందశాతం రికవరీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ అన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్‌తో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్ఎఫ్ వారీగా కొత్తసంఘాల ఏర్పాటు, స్త్రీనిధి రుణాల రికవరీ, నల్లగొండలో జరిగే సరాస్ ఎగ్జిబిషన్‌పై రివ్యూ నిర్వహించారు. సమావేశంలో టీఎంసీ బక్కయ్య, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, మల్లీశ్వరి, సీఓలు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష

రామగిరి, జనవరి 31: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, శనివారం కూడా పరీక్ష జరుగుతుందని డీఐఈఓ దస్రూనాయక్ వెల్లడించారు.

### ఇంజినీరింగ్‌లో నైపుణ్యం సాధిస్తే ఉత్తమ అవకాశాలు

రామగిరి, జనవరి 31: ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు తమ బ్రాంచ్‌లో నైపుణ్యం సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూర్ అధ్యాపకుడు గోపాల్ హెగ్డే సూచించారు. ఎంజీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం 'ఇంజినీరింగ్‌లో ఉపాధి అవకాశాలు' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 3న మండల స్థాయి కబడ్డీ పోటీలు

తిరుమలగిరి(సాగర్), జనవరి 31: పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన వారిని డివిజన్‌కు అక్కడ విజయం సాధిస్తే జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల రెండో తేదీ లోపు తమ టీమ్ సభ్యుల పేర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

### సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు

మునుగోడు, జనవరి 31 : మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్ దీక్షలు చేస్తున్న వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ సమస్యలపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు వరికుప్పల ముత్యాలు, కట్టా లింగస్వామి ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ఇండోనేషియా అమ్మాయి... గుండ్రాంపల్లి అబ్బాయి

చిట్యాలలో ఒక్కటైన ప్రేమ జంట

వివాహం చేసుకున్న నాగరాజు, సఫిట్రి

చిట్యాల, జనవరి 31 : ఇండోనేషియా అమ్మాయి, గుండ్రాంపల్లి అబ్బాయి శుక్రవారం చిట్యాలలో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాంపల్లికి చెందిన సీమ సాలయ్య, యాదమ్మ దంపతుల కుమారుడు నాగరాజు హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇండోనేషియాలోని అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రిజ్కి సన్‌డా సఫిట్రితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పడింది. సఫిట్రికి ఇండోనేషియాలో తక్కువ వేతనం వస్తుండటంతో నాగరాజు ఆమెను ఇండియాకు రప్పించి హైదరాబాద్‌లోని కంపెనీలో ఎక్కువ వేతనం వచ్చేలా ఏర్పాటు చేశాడు. వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారటంతో వారు వివాహానికి తమ కుటుంబ సభ్యులను ఒప్పించారు. శుక్రవారం గుండ్రాంపల్లిలో హిందూ సంప్రదాయం ప్రకారం వీరి వివాహం జరిగింది.

### సివిల్ రైట్స్‌పై అవగాహన కలిగి ఉండాలి : తాసీల్దార్

మిర్యాలగూడ రూరల్, జనవరి 31 : రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తాసీల్దార్ హరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని తుంగహాహ్డ్ గ్రామంలో నిర్వహించిన మానవ హక్కులపై అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాదగిరి, వెంకన్న, సజ్జల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### మొల్కచర్లలో పౌర హక్కుల దినోత్సవం

అడవిదేవులపల్లి : మండలంలోని మొల్కచర్ల గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఎస్ఐ శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● నకిరేకల్ సీనియర్ కోర్టు సివిల్ జడ్జి మంజుల

మాట్లాడుతున్న సీనియర్ కోర్టు సివిల్ జడ్జి మంజుల

కట్టంగూర్, జనవరి 31 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నకిరేకల్ సీనియర్ కోర్టు సివిల్ జడ్జి మంజుల అన్నారు. శుక్రవారం కట్టంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉచిత న్యాయ సాయం, గృహహింస చట్టంతో పాటు భూములపై కోర్టులో ఉన్న కేసులను లీగల్ సర్వీస్ ద్వారా ఉచితంగా పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు వ్యవసాయం కోసం అప్పులు తీసుకునే సమయంలో తెల్లకాగితంపై సంతకాలు చేయవద్దని సూచించారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అమ్మకం, రిజిస్ట్రేషన్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈఓ అంబటి అంజయ్య, ఎంపీఓ చింతమల్ల చలపతి, సీనియర్ న్యాయవాదులు ప్రకాశ్‌రావ్, శేరి ఛత్రపతి, మాజీ సర్పంచ్ చెనగోని సతీశ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

## పశు గణన పాదర్శకంగా నిర్వహించాలి

● పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు విశ్వేశ్వర్‌రావు

మాట్లాడుతున్న విశేశ్వర్‌రావు

మిర్యాలగూడ రూరల్,జనవరి 31 : జాతీయ పశు గణన పారదర్శకంగా నిర్వహించాలని, ఈ నెలలో పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు బొడ్డు విశ్వేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం పట్టణంలోని పశు వైద్యశాలలో క్లస్టర్ లెవల్ అధికారులు , ఇన్యూమరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2011 జాతీయ పశు గణన లెక్కల ప్రకారం జిల్లాలో 4.45 లక్షల పశు సంతతి ఉందన్నారు. సమావేశంలో సహాయ సంచాలకుడు శంకర్‌రావు, పశు వైద్యులు నాయిని దుర్గారమాదేవి, జ్ఞానేంద్ర ప్రసాద్, శంకర్‌రావు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న పాల్గొన్న అధికారులు

హాలియా, జనవరి 31 : హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మండలంలోని సబ్‌సెంటర్ల సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిబ్బంది పనితీరు మెరుగుపడాలని, సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. మండల వైద్యాధికారి రామకృష్ణ, సీహెచ్ఓ తావునాయక్, పీహెచ్ఎస్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, తబిత, ఫీల్డ్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఎంవీఐ వీరస్వామి

రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ వీరస్వామి, పోలీసు అధికారులు

మిర్యాలగూడ, జనవరి 31: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంవీఐ వీరస్వామి అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్‌ను ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ పి.నాగార్జున, రూరల్ ఎస్ఐ లోకేశ్, ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్.శ్రీనివాస్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగాపురం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి సురేశ్‌రెడ్డి, నవీన్‌కుమార్, అనంతుల నాగరాజు, గార్లపాటి రాంభద్రారెడ్డి, వల్లె దేవేందర్‌రెడ్డి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

## సరోజ కుటుంబానికి రవీంద్రకుమార్ పరామర్శ


సరోజ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ రూరల్, జనవరి 31 : మండలంలోని పెద్దతాండాకు చెందిన సమావత్ సరోజ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ వారి ఇంటికి వెళ్లి సరోజ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రమావత్ నర్సింహ, హిమవంత్ కుమార్ ఉన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని వినతి